



# కరపత్రం

SINCE 2014

గురువారం జూన్ 26 2025 సంపుటి :0 సంచిక :251 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4


# తెలంగాణలో విద్యావ్యవస్థ మరింత పటిష్టం

### అదనపు కలెక్టర్లు పాఠశాలలను సందర్శించాలి

### కొత్తగా చేరుతున్న పిల్లలకు అనుగుణంగా సౌకర్యాల కల్పన

### అధికారులకు సూచించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,జూన్25:
తెలంగాణలో విద్యా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం విద్యను బలోపేతం చేసేందుకు అనేక చర్యలు తీసుకున్నదని అన్నారు. అదనపు కలెక్టర్లు వారంలో కనీసం రెండు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని సీఎం సూచించారు. కమాండ్ కంట్రోల్ కార్యాల్యంలో విద్యాశాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి 48 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారని సీఎంకు అధికారులు వివరించారు. పెరిగిన విద్యార్థులకు అనుగుణంగా నూతన గదులు నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు అవసరమైన వసతులను పాఠశాలల్లో కల్పించాలని, గ్యాస్.. కట్టెల పొయ్యిల బాధ లేకుండా మధ్యాహ్న భోజనం తయారు చేసే మహిళలకు సోలార్ కిచెన్లు ఏర్పాటుపై వెంటనే దృష్టి పెట్టాలని సూచించారు. పదో తరగతిలో ఉత్తీర్ణలవుతున్న విద్యార్థులకు, ఇంటర్‌లో చేరుతున్న విద్యార్థుల సంఖ్యకు మధ్య తేడా ఎందుకు ఎక్కువగా ఉందని అధికారుల్ని ప్రశ్నించారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా ఇంటర్‌లో చేరేలా చూడాలన్నారు. ఇంటర్ తర్వాత జీవనోపాధికి అవసరమైన స్కిల్డ్ కోర్సుల్లో శిక్షణ పొందొచ్చని, తద్వారా వారి జీవితానికి ఢోకా ఉండదని సీఎం అభిప్రాయపడ్డారు.పదో తరగతిలో ఉత్తీర్ణులవుతున్న విద్యార్థుల సంఖ్యకు, ఇంటర్మీడియట్‌లో నమోదు అవుతున్న విద్యార్థుల సంఖ్యకు మధ్య వ్యత్యాసం ఎక్కువ ఉండడంపై సీఎం అధికారులను ప్రశ్నించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా కచ్చితంగా ఇంటర్మీడియట్‌లో చేరేలా చూడాలని సీఎం సూచించారు.



ఈ సమావేశంలో సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## స్థానిక సంస్థల ఎన్నికలపై తొలగిన అనిశ్చితి

- మూడు నెలల్లో ఎన్నికల నిర్వహణ పూర్తి చేయండి
- రాష్ట్ర ఎన్నికలసంఘానికి తెలంగాణ హైకోర్టు ఆదేశం

హైదరాబాద్,జూన్25:
తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న అనిశ్చితి తొలగింది. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పును వెల్లడించింది. సెప్టెంబర్ 30లోగా తప్పనిసరిగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిందిగా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. గత కొంత కాలంగా గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ స్థానాలకు ఎన్నికలు జరగకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్త పరుస్తున్నారు.

2 లో

## భారాస సోషల్ మీడియా ప్రచారం ప్రజలు నమ్మొద్దు: మహేశ్ కుమార్‌గౌడ్



హైదరాబాద్:
భారాస సోషల్ మీడియా ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు."కాంగ్రెస్ హయాంలో జరిగిన సామాజికన్యాయం ఏ ప్రభుత్వంలోనూ జరగదు. గత ప్రభుత్వం ఎన్నికల కోసమే పథకాలు తెచ్చేది. హుజూరాబాద్ ఎన్నిక కోసమే దళితబంధు తీసుకొచ్చారు.




2లో..

## అంతరిక్షంలోకి అడుగుపెట్టిన శుభాంశు శుక్లా

- కెనడీ స్పేస్ సెంటర్ నుంచి అంతరిక్ష ప్రయోగం సక్సెస్
- స్పేస్ఎక్స్ డ్రాగన్ అంతరిక్ష నౌక ద్వారా మరో ముగ్గురితో కలసి ప్రయాణం

న్యూఢిల్లీ,జూన్25
భారత వైమానిక దళ గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా, ఆక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతరిక్షంలోకి విజయవంతంగా దూసుకెళ్లారు. దీంతో అతను మరో చరిత్ర సృష్టించారు. శుభాన్షు కక్ష్యకు చేరుకున్న రెండవ భారతీయుడు , అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంకి ప్రయాణించిన మొదటి భారతీయుడు అయ్యారు. ఈ ప్రయోగం బుధవారం ఫ్లోరిడాలోని నాసాకు చెందిన కెన్నెడీ స్పేస్ సెంటర్ నుండి స్పేస్ఎక్స్ డ్రాగన్ అంతరిక్ష నౌక ద్వారా జరిగింది.



## మెట్రో విస్తరణపై కేంద్రం నిర్లక్ష్యం

- కేబినేట్‌లో చర్చించకపోవడం విచారకరం
- ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకోరా
- ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

న్యూఢిల్లీ,జూన్25:
హైదరాబాద్ మెట్రో ఫేజ్-2పై కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. అనేక పర్యాయాలు కేంద్రమంత్రులను, ప్రధానిని కలిసి సిఎం విన్నవించినా ఆమోదం దక్కకపోవడం విచారకరమన్నారు. తాజాగా కేబినేట్‌లో ఈ అంశం చర్చించక పోవడం తెలంగాణకు తీరని అన్యాయమని భావిస్తున్నామని అన్నారు. దిల్లీ పర్యటనలో ఉన్న ఆయన ముగ్గురు కేంద్రమంత్రులను కలిశారు. కేంద్రమంత్రులు కుమారస్వామి, పీయూష్ గోయల్, శ్రీపాద యశోనాయక్‌లను కలిసిన శ్రీధర్‌బాబు.. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించిన భూముల అంశంపై చర్చలు జరిపారు. సమస్యల పరిష్కారానికి కేంద్రం చొరవ చూపాలని కోరారు.

2లో..





## ఏపీ బనకచర్ల ప్రాజెక్టుపై సంచలన నిర్ణయం : న్యాయ పోరాటం చేస్తామన్న మంత్రి ఉత్తమ్

హైదరాబాద్,జూన్25:
ఏపీ,తెలంగాణ మధ్య వివాదంగా మారిన బనకచర్ల ప్రాజెక్ట్ పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గోదావరి బనకచర్ల ప్రాజెక్ట్ ను ఆపడానికి చట్టపరంగా ముందుకెళ్తామని ఇరిగేషన్ మినిస్టర్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. బనకచర్లతో తెలంగాణకు నష్టమన్న ఉత్తమ్.. తెలంగాణ వాదాన్ని బలంగా వినిపించేందుకు న్యాయపోరాటానికి సంబంధించి రోడ్ మ్యాప్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

2లో..

## నేటినుంచి నగరంలో బోనాల సందడి

- తొలిబోనం గోల్కొండతో ప్రారంభం
- నెలరోజుల పాటు బోనాల జాతర



2 లో

హైదరాబాద్,జూన్25:
నేటి నుంచి ఆషాడం ప్రవేశంతో జంటనగరాల్లో బోనాల సందడి మొదలు కానుంది. ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొనే బోనాల ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం బోనాలను అధికారిక పండుగగా ప్రకటించినది. దాంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని అలయాల్లో ఉన్న అమ్మవార్లకు భక్తులు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు.

## మియాపూర్‌లో టెకీ ఆత్మహత్య.. ఇటీవలే నిశ్చితార్థం!

హైదరాబాద్:
మియాపూర్ పరిధిలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విషాదం రేపింది. మానసిక రుగ్మతలు, ఒత్తిడి వల్లే ఆత్మహత్యకు పాల్పడినట్లు అతడి తల్లిదండ్రులు తెలిపారు.



2 లో



## హొటల్ గదిలో వివాహిత అనుమానాస్పద మృతి.. ఆలస్యంగా వెలుగులోకి..

హైదరాబాద్:
బ్యూటీషియన్ ఆత్మహత్య చేసుకున్న ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి రాయదుర్గం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

## ఎమర్జెన్సీ పాలన దేశానికి మాయని మచ్చ - కేంద్రమంత్రి బండి సంజయ్

హైదరాబాద్:
ఎమర్జెన్సీ పాలన చీకటి అధ్యాయం.. దేశానికి మాయని మచ్చ అని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఎమర్జెన్సీ ప్రకటించి 50 ఏళ్లు గడిచిన సందర్భంగా .. నాటి పరిస్థితులపై 'ఎక్స్' వేదికగా స్పందించారు."ప్రజాస్వామ్యానికి పాతరేసి, నియంతృత్వం రాజ్యమేలిన రోజు. దేశమంతా అధికార దాహమనే చీకటితో నిండిన రోజు. స్వాతంత్ర్యాన్ని కాలరాసి, రాక్షసత్వం రాజ్యమేలిన రోజు. వ్యక్తి స్వేచ్ఛకు సమాధి కట్టి రాజ్యాంగాన్ని పరిహసించిన రోజు కాంగ్రెస్ పార్టీ విధించిన ఎమర్జెన్సీ. భారతదేశ చరిత్రలో ఒక చీకటి అధ్యాయంగా మిగిల్చిన దుర్దినం. ఎమర్జెన్సీని ఎత్తివేసేందుకు పాటుపడి, రాజ్యాంగ విలువలను కాపాడానికి జైళ్లలో మగ్గిన ఎందరో మహనీయుల సేవలను స్మరించుకుంటూ రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడదాం" అని బండి సంజయ్ పేర్కొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికలపై తొలగిన అనిశ్చితి

మొదటిపేజీ తరువాయి
ఈ అంశంపై ఆరుగురు మాజీ సర్పంచులు హైకోర్టును ఆశ్రయించారు. వారు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన అనంతరం హైకోర్టు ఈ తీర్పును వెల్లడించింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వ తరఫున న్యాయవాదులు రిజర్వేషన్ల పక్రియ పూర్తి చేయడానికి కనీసం మరో 30 రోజుల గడువు అవసరం అని తెలపడంతో హైకోర్టు ఆ అభ్యర్థనని పరిగణనలోకి తీసుకుంది. దీనితో రిజర్వేషన్ల పక్రియ పూర్తయిన తర్వాత, ఎన్నికల నిర్వహణకు మరో 60 రోజులు కావాలన్న రాష్ట్ర ఎన్నికల సంఘం అభ్యర్థనకు కూడా కోర్టు అంగీకారం తెలిపింది. దీనివల్ల కలిపి గరిష్ఠంగా 90 రోజుల లోపుల ఎన్నికల పక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. దీనితో, 2025 సెప్టెంబర్ 30వ తేదీ లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై పడనుంది. స్థానిక పాలన లోపిస్తున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, ప్రజాప్రతినిధులు లేని పాలన వల్ల గ్రామీణాభివృద్ధి ఇబ్బందిగా మారుతుందని పిటిషనర్లు కోర్టును ఆశ్రయించారు. తమ గ్రామాలలో నూతన అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోవడం, పథకాల అమలు జాప్యం కావడం వల్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వారు కోర్టుకు విన్నవించుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. గ్రామపంచాయతీ ఎన్నికలు 3 నెలల్లో నిర్వహించాలని, 30 రోజుల్లో వార్డుల విభజన పక్రియ పూర్తి చేయాలని ఆదేశిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవీదేవి బుధవారం తీర్పు వెలువరించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు 2024 జనవరి 30వ తేదీతో ముగిసినా ఎన్నికల నిర్వహణలో జాప్యం ఎందుకని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ప్రశ్నించింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించక పోవడాన్ని సవాలు చేస్తూ పలువురు మాజీ సర్పంచులు దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన జస్టిస్ టి.మాధవిదేవి తీర్పు ఇచ్చారు. తొలుత పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. గతేడాది జనవరి 31తో సర్పంచుల పదవీ కాలం ముగిసినా.. ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోంది. సర్పంచులను తప్పించి పంచాయతీల బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించింది. ఇది రాజ్యాంగ, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాలకు విరుద్ధం. ప్రత్యేక అధికారులు ఇతర విధుల్లో ఉండటంతో ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా నిధులు సమకూరు స్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీతో పలువురు సర్పంచులు సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేయించారు. ప్రస్తుతం ఆ నిధులు అందక ఇబ్బందులుపడుతున్నారు. వివిధ పథకాల కింద కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడంలేదు. వెంటనే ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి. లేకుంటే పాత సర్పంచులకే బాధ్యతలు అప్పగించాలి' అని కోరారు. ప్రభుత్వం తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ... సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల పక్రియ చేపట్టాల్సి ఉందన్నారు. ఈ పక్రియ పూర్తికావడానికి మరో నెల రోజుల గడువు అవసరమని కోరారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. ఎన్నికల నిర్వహణపై గతంలో ఒకసారి హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం తరపున సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. ఇది పూర్తికాగానే ఎన్నికల పక్రియ ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలిపాక.. పక్రియ పూర్తి చేయడానికి రెండు నెలల సమయం పడుతుందన్నారు. దీనిపై న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ సకాలంలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఎన్నికల సంఘం చొరవ తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసినందున... ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. న్యాయవాది సమాధానమిస్తూ.. రిజర్వేషన్ల ఖరారుతో పాటు ఎన్నికలకు ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి మూడు నెలల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు.

## అంతరిక్షంలోకి అడుగుపెట్టిన శుభాంశు శుక్లా

మొదటిపేజీ తరువాయి
ఆక్సియం-4 మిషన్ ఒక ప్రైవేట్ అంతరిక్ష విమాన వెంచర్. శుక్లాతో పాటు మరో ముగ్గురు అంతర్జాతీయ వ్యోమగాములు అంతరిక్షంలో చేరారు. శుభాన్షు అంతరిక్షయాత్ర భారతదేశ అంతరిక్ష కార్యక్రమంలో ఓ ముఖ్యమైన ఘట్టం. 41 సంవత్సరాల తర్వాత ఒ భారతీయుడు అంతరిక్షంలోకి ప్రయాణించడం ఇదే మొదటిసారి. 1984లో భారత వైమానిక దళ అధికారి, స్క్వాడ్రాన్ లీడర్ రాకేశ్ శర్మ అంతరిక్షంలోకి దూసుకెళ్లిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించారు. కజకిస్తాన్ నుంచి సోవియెట్ అంతరిక్ష నౌకలో సోయెజ్ -టి-11 అంతరిక్ష నౌకద్వారా అంతరిక్షంలోకి దూసుకెళ్లిన భారతీయుడు అయ్యాడు. నాలుగు దశాబ్దాల తర్వాత మరో అద్భుతం ఇది. శుభాన్షు శుక్లా కక్ష్యలోకి దూసుకెళ్లడం ద్వారా భారత అంతరిక్షచరిత్రలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాడు. అలాగే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం( ఐఎస్ ఎస్ ) ప్రయోగాలు చేస్తున్న మొదటి భారతీయపౌరుడిగా రికార్డులకు ఎక్కాడు, రాకేశ్ శర్మ చారిత్రాత్మక అంతరిక్షయాత్ర జరిగిన తర్వాత ఒక సంవత్సరానికి 1985లో జన్మించిన శుక్లా ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కెప్టెన్, ప్రస్తుతం వ్యోమగామి. ఆక్సియమ్ స్పేస్ యాక్స్ -4 మిషన్లో భాగంగా ఎ÷-లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి స్పేస్ ఎక్స్ డ్రాగన్ అంతరిక్షనౌకను ప్రయోగించారు. బుధవారం ఫాల్కన్ -9 లోని మెర్లిన్ ఇంజన్లు నిప్పులు చిమ్ముకుంటూ స్పేస్ ఎక్స్రాగ్రాన్ ను ఎర్త్ ఆర్బిట్ లోకి తీసుకెళ్లింది. నిర్దేశిరచిన ఖచ్చితత్వంతో ఫాల్కన్-9 డ్రాగన్ ను కక్ష్యలో ప్రవేశపెట్టింది. రెండోదశలో డ్రాగన్ మరింత ముందుకు దూసుకెళ్లి అంతరిక్ష ప్రయోగశాల వైపు సాగింది. ప్రయోగం ప్రారంభం కావడానికి ఓ గంటముందు శుక్లా, ఇతర వ్యోమగాములు తమతమ కుటుంబ సభ్యులకు వీడ్కోలు పలికారు. శుక్లా భార్య,పిల్లలు కూడా శుభాకాంక్షలు చెప్పారు. విఘ్నాలతో ఆలస్యమైన అంతరిక్ష ప్రయాణం కొన్ని విఘ్నాల కారణంగా మే 28నే జరగాల్సిన ఈ ప్రయోగం ఆలస్యం అయింది. సాంకేతిక లోపాలు,ఫాల్కన్ -9, డ్రాగన్ అంతరిక్ష నౌక, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో వాతావరణ పరిస్థితులు, ఇలా ఎన్నో కారణాల వల్ల జాప్యం జరిగింది. నలుగురు వ్యోమగాములు దాదాపు నెల్లాళ్లపాటు నిర్బంధంలో ఉండాల్సివచ్చింది. స్పెస్ ఎక్స్, ఆక్సియమ్, నాసా, ఇస్రో నిపుణులు లోపలన్నింటినీ విజయవంతంగా చక్కదిద్దారు. ఎట్టకేలకు బుధవారంనాడు విజయవంతంగా ప్రయోగం జరిగింది. అంతరిక్ష ప్రయాణంలో విఘ్నాలు ఓ భాగం, మిషన్ ఆలస్యం అయినా యాక్స్-4 సిబ్బంది ఉత్సాహంగా అంతరిక్ష కేంద్రానికి సురక్షితమైన,విజయవంతమైన ప్రయాణంకోసం ఎదురు చూశారని మిషన్ కమాండర్ పెగ్గి విట్సన్ తెలిపారు.ఎఎక్స్ ? సిబ్బందితో డ్రాగన్ అంతరిక్ష నౌక ప్రస్తుతం భూమి నుంచి 400 కిలోమీటర్ల ఎత్తులోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని కలిసేందుకు నిర్దేశిరచిన భూ కక్ష్యలో తిరుగుతోంది.మిశన్ పైలట్ అయిన శుక్లా అంతరిక్ష కేంద్రానికి సాగుతున్న ప్రయాణాన్ని పరిశీలిస్తారు. గతంలో మిగ్ -21, మిగ్ -29, డోర్నియర్, ఎఎన్- 32, సుఖోయ్ -30వంటి పలు విమానాల టెస్ట్ పైలెట్ అయిన శుక్లా డ్రాగాన్ అంతరిక్ష నౌక పైలట్ గా కీలకపాత్ర వహిస్తున్నారు. భారతీయ వ్యోమగామి శుభాన్షు శుక్లాను ఆయన అంతరిక్ష సహచరులు షుక్స్ అని వ్యవహరిస్తారు.శుక్లాతో పాటు ఎఎక్స్- 4 మిషన్ కు నాయకత్వం వహిస్తున్న అమెరికన్ వ్యోమగామి డాక్టర్ పెగ్గీ విట్సన్.అంతరిక్షంలో 675 రోజులు గడిపిన అనుభవజ్ఞుడు ఉన్నారు. మిగతా ఇద్దరు మిశన్ నిపుణులు పోలెండ్ కు చెందిన సవోస్జ్ ఉజ్నాన్స్కీ, హంగేరికి చెందిన డిబోర్ కాపు. డ్రాగన్ మిషన్లు 1,000 కంటే ఎక్కువ సైన్స్, పరిశోధన ప్రాజెక్టులను ప్రారంభించాయి. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో శుభాన్షు శుక్లా భారతీయ శాస్త్రవేత్తలు రూపొందించిన ఏడు అత్యాధునిక ప్రయోగాలను నిర్వహిస్తారు. సుక్ష్మ గురుత్వాకర్షణ( మైక్రో గ్రావిటీలో) జీవశాస్త్రం, ఆహారం, వైద్యం, మానసిక ఆరోగ్యానికి సంబంధించిన ప్రయోగాలు నిర్వహిస్తారు.

## స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు లంచం డిమాండ్.. ఏసీబీ వలలో కల్వకుర్తి రెండో ఎస్సై



నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై-2గా పనిచేస్తున్న ఎం.రామచందర్ జి.. ఏసీబీ అధికారులకు బుధవారం రాత్రి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సీహెచ్ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుర్తి మండలం గుండూరు గ్రామానికి చెందిన వెంకటయ్య, అతని సోదరుడికి మధ్య నెలకొన్న భూవివాదంపై జూన్ 23న కేసు నమోదైంది. ఈ కేసులో స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు ఎస్సై-2 రామచందర్ జి.. వెంకటయ్యను రూ.20 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో అతను మంగళవారం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.బుధవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో బాధితుడు మహబూబ్‌నగర్ కూడలి నుంచి ఫోన్ చేయగా పోలీస్ స్టేషన్‌కు రమ్మని చెప్పి.. ఆవరణలో రూ. 10వేలు ఎడమ చేతితో తీసుకుని ఎడమ జేబులో పెట్టుకుని పోలీస్ స్టేషన్ లోపలికి వెళ్లి కూర్చున్నారు. అప్పటికే అక్కడికి చేరుకున్న ఏసీబీ అధికారులు వెంటనే స్పందించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ మేరకు నిందితుడు ఎం. రామచందర్ జిని గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో హాజరు పరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. 22 మార్చి 2024న బదిలీపై కల్వకుర్తికి వచ్చిన రామచందర్ జి.. మరో 11 నెలల్లో పదవీ విరమణ చేయనున్నట్లు సమాచారం.

## బోనాల ఉత్సవాలకు 20కోట్లు విడుదల: మంత్రి పొన్నం



జంటనగరాల్లో జరిగే బోనాల ఉత్సవాలకు తెలంగాణ ప్రభుత్వం రూ.20కోట్లు మంజూరు చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని 2,783 ఆలయాలకు వివిధ కార్యక్రమాలు నిర్వహణ కోసం నిధులను చెక్కుల రూపంలో జారీ చేసిందన్నారు. ఆషాఢ మాసంలో ముందుగా నగరంలోని గోల్కొండ బోనాలు జూన్ 29న జులై 1, 2 తేదీల్లో బల్కంపేట ఎల్లమ్మ బోనాలు, జులై 13, 14 తేదీల్లో శ్రీ ఉజ్జయిని మహాకాళి దేవస్థానం బోనాలు, జులై 20న లాల్ దర్వాజా బోనాలు.. జులై 23న చార్మినార్ భాగ్యలక్ష్మి బోనాలు, మిగిలిన దేవాలయాల్లో ఈ ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని పేర్కొన్నారు.

## నేటినుంచి నగరంలో బోనాల సందడి

మొదటిపేజీ తరువాయి
నెల రోజులపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల వద్ద అవసరమైన ఏర్పాట్లను చేసింది. గోల్కొంట కోటలో బోనాలు మొదట ప్రారంభించే సంప్రదాయం వస్తుంది. దీంతో గోల్కొండ బోనాలతో సందడి మొదలు కానుంది. గురువారం మొదలు కానున్న ఈ సందడిలో భాగంగా ఆదివారం గోల్కొండ బోనాలు జరగనున్నాయి. బోనాలు సంప్రదాయం ప్రకారం ప్రసిద్ధి చెందిన గోల్కొండ కోటలోని శ్రీఎల్లమ్మ (జగదాంబిక) ఆలయంలో ప్రారంభం కావడం ఆనవాయితీ. ప్రతీ సంవత్సరం ఆషాడమాసంలో ఆమావాస్య తర్వాత వచ్చే గురువారం, లేదా ఆదివారం బోనాలు ప్రారంభవవుతాయి. అయితే, ఈ నెల బుధవారం అమవాస్య కావడంతో ఆ తర్వాత రోజు గురువారం బోనాల జాతర మొదలుకానుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను నిర్వహిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు అందజేస్తుంది. బోనాలు ఉత్సవాలకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలోని శ్రీజగదాంభిక ట్రస్టు బోర్డు ఏర్పాట్లు మొదలుపెట్టింది. ఇప్పటికే మంత్రి పొన్న ప్రభాకర్ సమీక్ష చేశారు. గురువారం నుంచి జూలై 24వతేదీ వరకు తెలంగాణలో బోనాల జాతర జరుగనుంది. నెలరోజుల పాటు ఇక్కడ తొమ్మిది ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ పూజలకు నగరంతో పాటు వివిధ జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు రానున్నారు. వీరికోసం గోల్కొండ కోటలోని అక్కన్న మాదన్న కార్యాలయాలు, బాడిగార్డ్స్ లైన్స్ ప్రాంతాలు సిద్ధం చేస్తున్నారు. పూజల ప్రారంభోత్సవంలో భాగంగా మొదటి రోజు లంగర్‌హౌజ్ చౌరస్తా నుంచి అమ్మవారి తొట్టెల ఊరేగింపు నిర్వహిస్తారు.
చోటాబజార్‌లోని ఆలయం పూజారి ఇంటి నుంచి అమ్మవారి విగ్రహం, ఘట్టం ఊరేగింపు, బంజారాదర్వాజ నుంచి మొదటి బోనం ఊరేగింపు నిర్వహిస్తారు. ఇవన్నీ గోల్కొండ కోటపైకి చేరిన తర్వాత ఆలయం ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, బోనం అమ్మవారిక సమర్పిస్తారు. కోటలో బోనాల జాతర జరుగనుండ డడంతో గోల్కొండ కోట పాలన చూస్తున్న కేంద్ర పురావస్తు శాఖ పలు మార్పులు చేయనుంది. బోనాలు జరిగే ఆదివారం, గురువారం రోజుల్లో ఉచిత ప్రవేశం కల్పించారు. కోటలో ప్రతీ రోజు రాష్ట్ర పర్యాటక సంస్థ రెండు లైట్ అండ్ సౌండ్ షోలు నిర్వహిస్తుంది. ఆదివారం, గురువారాలు మొదటి షోను రద్దు చేస్తారు. రెండవ షో 8 గంటల నుంచి యధావిధిగా ఉంటుంది.

## ఏపీ బనకచర్ల ప్రాజెక్టుపై సంచలన నిర్ణయం : న్యాయ పోరాటం చేస్తామన్న మంత్రి ఉత్తమ్

మొదటిపేజీ తరువాయి
జూన్ 25న జల సౌధలో సీనియర్ నీటిపారుదల అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జూన్ 30న మధ్యాహ్నం 3 గంటలకు ప్రజా భవన్‌లో గోదావరి -బనకచెర్ల లింక్ ప్రాజెక్టుపై వివరణాత్మక ప్రజెంటేషన్ ఉంటుందన్నారు. గత BRS పాలనలో ఈ ప్రాజెక్టు ఎలా ఉద్భవించిందో స్పష్టమైన డాక్యుమెంటేషన్‌ను చేర్చడానికి ప్రజెంటేషన్‌ను రెడీ చేయాలని ..తద్వారా ఆంధ్ర ప్రస్తుత చర్య వెనుక ఉన్న రాజకీయ నేపథ్యాన్ని బహిర్గతం చేయాలని ఆయన ఆదేశించారు. ఇప్పటికే జూన్ 19న కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ తో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. బనకచర్లపై కేంద్ర మంత్రికి ఫిర్యాదు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిబంధనలను అతిక్రమించి బనకచర్ల నిర్మిస్తోందని కంప్లైంట్ ఇచ్చామని భేటీ తర్వాత మంత్రి ఉత్తమ్ తెలిపారు..తమ అభ్యంతరాలను కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్ కు చెప్పినట్లు తెలిపారు. ఏపీ చట్ట వ్యతిరేకంగా నిర్మాణం చేపడుతుందని.. అనుమతులు ఇవ్వద్దని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. బనకచర్ల నిర్మాణంతో తెలంగాణకు అన్యాయం జరిగిందని.. బనకచర్ల పునర్విభజన చట్టానికి పూర్తి విరుద్ధమని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తెలంగాణ రైతుల్లో ఆందోళన నెలకొందని, బనకచర్లకు అనుమతి ఇవ్వద్దని కోరినట్లు చెప్పారు.

### ఏపీ తీరుతోనే వివాదం..

సముద్రంలో కలిసే గోదావరి జలాల విషయంలో వాస్తవాలు, రాజకీయాలు ముడిపడి ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. "వాస్తవానికి సముద్రంలో కలిసే జలాలపై ఏపీ, తెలంగాణ కూర్చొని మాట్లాడుకుంటే సమస్య పరిష్కారమయ్యేది. కానీ తెలంగాణ ప్రభుత్వాన్ని సంప్రదించకుండా ఏపీ సీఎం చంద్రబాబు కేంద్రం దగ్గరకు వెళ్లడం సరికాదు. ఇది బీఆర్ఎస్‌కు రాజకీయ ఆయుధంగా మారింది. ఏపీ విభజన చట్టం-2014లో రెండు రాష్ట్రాల మధ్య నీటి వివాదాల కోసం ఆఫీసర్స్, టెక్నికల్, అపెక్స్ కౌనిల్స్ ఏర్పాటు చేశారు.

## మియాపూర్‌లో టెకీ ఆత్మహత్య.. ఇటీవలే నిశ్చితార్థం!

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్న అనిల్ అమిత్ చౌద (30).. మియాపూర్‌లోని హాఫీజ్‌పేటలో తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఇటీవలే అతడికి ఓ యువతితో నిశ్చితార్థం జరగ్గా.. నవంబర్‌లో వివాహం జరగాల్సి ఉంది. అయితే, మంగళవారం రాత్రి గదిలోకి వెళ్లిన అనిల్.. ఎంత సేపటికీ తలుపులు తెరవకపోవడంతో తల్లిదండ్రులు తలుపులు బద్దలు కొట్టి చూడగా.. సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. దీంతో తీవ్ర దిగ్భ్రాంతికి లోనైన తల్లిదండ్రులు మియాపూర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. అనిల్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు.

## హొటల్ గదిలో వివాహిత అనుమానాస్పద మృతి.. ఆలస్యంగా వెలుగులోకి..

మొదటిపేజీ తరువాయి
బ్యూటీషియన్ అనూష(26)కు భర్తతో మనస్పర్థలు రావడంతో.. బీహెచ్ఈఎల్ సమీపంలో తల్లిదండ్రులతో కలిసి ఉంటోంది. ఆదివారం స్నేహితుల వద్దకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన అనూష తిరిగి రాలేదు. ఆందోళకు గురైన కుటుంబ సభ్యులు ఆమెకు ఫోన్ చేసినా స్పందించలేదు. సోమవారం ఓ హెూటల్ గదిలో ఆమె అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. అయితే, అనూష స్నేహితుడు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుందని తెలిపాడు. ఆమె ఉన్న హెూటల్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. అనూష మృతిపై అనుమానాలు ఉన్నాయని ఆమె సోదరుడు ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేసుకొని అన్ని కోణాల్లో విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## భారాస సోషల్ మీడియా ప్రచారం ప్రజలు నమ్మొద్దు: మహేశ్ కుమార్‌గౌడ్

మొదటిపేజీ తరువాయి
భారాస పదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధిని.. కాంగ్రెస్ 18 నెలల్లో చేసింది. అభూత కల్పనలతో సోషల్ మీడియాలో భారాస ప్రచారం చేస్తోంది. రాష్ట్రంలో పరిపాలన అద్భుతంగా జరుగుతోంది. పదేళ్ల భారాస పాలన తర్వాత వాళ్ల పరిస్థితి ఏంటో ప్రజలకు తెలుసు. రాష్ట్ర అవసరాలను, హక్కులను గత ప్రభుత్వం తాకట్టుపెట్టింది. గోదావరి-బనకచర్లపై లోతుగా అధ్యయనం చేసి నిర్ణయం ప్రకటిస్తాం" అని మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

## మెట్రో విస్తరణపై కేంద్రం నిర్లక్ష్యం

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2పై కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. దీనిపై కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రధాని, కేంద్రమంత్రిని కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. మెట్రోపై ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కేంద్రం నిర్ణయం తీసుకోలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర క్యాబినెట్‌లో మెట్రోకు అనుమతి వస్తుందని భావించామన్నారు. దేశ జీడీపీలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.

## కోమటిరెడ్డిని కలిసిన సమాచార కమిషనర్

సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన ప్రియాంక రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. మర్యాదపూర్వకంగానే కలిసినట్లు వెల్లడించారు.

# అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

## - కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

- గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెట్ పల్లి
-అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొన్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇబ్రహింపట్నం ఎంపీడీవో సాంబారి చంద్ర శేఖర్ అధ్యక్షతన మండల అధికారులతో సాధారణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాల్గొన్నారు. పలుశాఖల అధికారులతో పలు అంశాలపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలని, కొన్ని గ్రామాల్లో గత వర్షాలకు తెగిపోయిన చెరువు కట్టల మరమ్మత్తులు ఇప్పటికీ చేయలేదని, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని, రాబోయే వర్షాకాలంకు ముందు వాటిని పూర్తి చేయాలని అన్నారు.

ఇరిగేషన్ మంత్రి మాట కూడా అధికారులు వినడం లేదని, రైతులను దృష్టిలో ఉంచుకొని చెరువుల మరమ్మత్తు పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులకు సుచించారు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని, నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు అందేలా అధికారులు నిజాయితీగా పనిచేయాలని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. పెండింగ్ లో ఉన్న నూతన రేషన్ కార్డ్ లు త్వరితగతిన జారీ అట్లియాలా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రత పట్ల అలసత్వం వహిస్తున్నారని, మెజారిటీ గ్రామాల్లో శానిటైజేషన్ జరగడంలేదని, గ్రామాల్లో నిర్వహించే శుభ్రత కార్యక్రమంలో పాల్గొనడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. అధికారులు తన ఉద్యోగానికి సరియైన న్యాయం చేయాలని, పల్లె ప్రకృతి వనాలను కాపాడాలని, కార్యదర్శులకు సూచించారు. చాలా గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉన్నట్లు తన దృష్టికి వస్తున్నాయని వాటి గురించి విధ్యుత్ శాఖ అదికారులు పరిశీలించి పరిష్కరించలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంపీడీఓ సాంబరి చంద్రశేఖర్ , తహసిల్దార్ వరప్రసాద్ , ఎడిఈ దురిశెట్టి మనోహర్ ,వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# జీడికె 11వ ఇంక్లైన్ గనిని సందర్శించిన ఎలక్ట్రికల్ డీఎంఎస్



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూన్ 25:**
జి.డి.కె 11 ఇంక్లైన్ గనిని ఎలక్ట్రికల్ డిఎంఎస్ కోమల్ చౌదరి బుధవారం సందర్శించారు. గని ఏజెంట్ కార్యాలయం గనిలోని వివిధ సీమ్/ ప్యానెల్, యంత్రముల వివరాలను ప్లాన్ల ద్వారా పరిశీలించారు. గని ఉత్పత్తి ఉత్పధకను, గనిలో తీసుకోవల్సిన రక్షణ చర్యల గురించి వివరించారు. తధనంతరం గనిలోని 1వ సీమ్ సీఎం 1 సెక్షన్ ను తనకీ చేసి తగు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గని ఏజెంట్ శ్రీనివాస్, ఏరియా సేఫ్టీ అధికారి సాయి ప్రసాద్, గని మేనేజర్ మల్లేశం, ఇంచార్జి గ్రూప్ ఇంజనీర్ ఓదెలు, రక్షణ అధికారి మల్లేష్, గని పిట్ ఇంజనీర్ రాకేష్, సెక్షన్ ఇంచార్జి వెంకటేష్, జీఎంఎంసీఓ ఇంచార్జ్ రాకేష్, ఎలక్ట్రికల్ సేఫ్టీ అధికారి కొమురయ్య, వెంటిలేషన్ అధికారి గని వర్క్మ మెన్ ఇన్స్పెక్టర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# టీపీసీసీ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ గా అడ్వకేట్ కోటగిరి వెంకటస్వామి

- గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెట్ పల్లి





వెంకటస్వామిని సన్మానిస్తున్న నాయకులు, గ్రామస్తులు

టీపీసీసీ లీగల్, హ్యూమన్ రైట్స్ మరియు సమాచార హక్కు విభాగం కమిటి రాష్ట్ర జాయింట్ కన్వీనర్ గా సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీ వెంకట స్వామి నియామకం జరిగింది. ఇబ్రహింపట్నం మాజీ మండల పరిషత్ అధ్యక్షులు,సీనియర్ న్యాయవాది కోటగిరి వెంకటస్వామి ని నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసి నియామక పత్రాన్ని కమిటీ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ అందచేశారు. తన నియామకానికి సహకరించిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు , మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి , రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, కొమిరెడ్డి కరం, నిజామాబాద్ పార్లమెంట్ లీగల్ సెల్ కోఆర్డినేటర్ గుంటి జగదీశ్వర్, జగిత్యాల జిల్లా లీగల్ సెల్ ఇంచార్జ్ సలీమ్ లకు వెంకట స్వామి కృతజ్ఞతలు తెలిపారు.

### - నాయకునికి సన్మానం

వెంకట స్వామి నియామకం పట్ల గోదూర్ గ్రామస్తులు,స్నేహితులు,అభిమానులు,బంధువులు హర్షం వ్యక్తం చేసారు. అభ్యుదయ భావాలు గల శ్రీ కోటగిరి వెంకటస్వామి సహృదయుడని అభినందించారు. న్యాయవాదిగా,ప్రజా నాయకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించిన శ్రీ వెంకటస్వామి మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని కోరుకుంటూ గ్రామస్తులంతా కలిసి సన్మానం చేశారు.

# ఆర్జి 1 అధికార ప్రతినిధినీ సన్మానించిన సేవా సమితి సభ్యులు



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూన్ 25:**
ఆర్జి 1 ఏరియాకు అధికార ప్రతినిధిగా పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సింగరేణి సేవా సమితి సభ్యులు, ఫ్యాకల్తి మెంబర్స్ వారిని పర్సనల్ విభాగంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సేవా సభ్యులు తెలియజేస్తూ సింగరేణిలోనే కీలకమైన రామగుండం ఏరియా-1 అధికార ప్రతినిధిగా భాధ్యతలు చేపట్టటం గొప్ప అవకాశం అన్నారు. ఈ కార్యక్రమములో సేవా సభ్యులు రమాదేవి, సత్యావతి, పద్మ, రేష్మ, శ్రీదేవి, స్రవంతి, శారద, లత, వనితా మరియు సేవా సమితి కో ఆర్డినేటర్ మేడి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# పసుపు బోర్డు కార్యాలయానికి తరలి రావాలి

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెట్ పల్లి**





గ్రామాల పర్యటనలో బిజెపి నాయకులు

భారతీయ జనతా పార్టీ ఇబ్రాహీం పట్నం మండల అధ్యక్షులు బాయి లింగారెడ్డి ఆధ్వర్యంలో బిజెపి కార్యకర్తలు నాయకులు మండల గ్రామాల్లో పర్యటించారు.

ఇబ్రాహీంపట్నం, వర్షకోండ, వేములకుర్తి తదితర గ్రామాలలో రైతులను,నాయకులను కలిసి ఈ నెల 29న నిజామాబాద్ లో జరిగే పసుపు బోర్డు కార్యలయం ప్రారంభ కార్యక్రమానికి భారతదేశ హెూమ్ శాఖ మంత్రి అమిత్ షా వస్తున్నారని లింగారెడ్డి చెప్పారు. రైతుల 40సంవత్సర కల నెరవేర్చిన నిజామాబాదు ఎంపీ ధర్మపురి అరవింద్ కు కృతజ్ఞతలు తెలుపుతూ కార్యక్రమనికి రావాలని పిలుపిచ్చారు.

రైతు సమ్మేళనం కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం మండలం నుండి రైతులు, మహిళలు,యువత బీజేపీ కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ ఆహ్వాన కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న మొబైల్స్ ను లబ్ధిదారులకు అందించి పట్టణ సీఐ రామకృష్ణ



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూన్ 25**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో పట్టణ సిఐ రామకృష్ణ మాట్లాడుతూ తేదీ 25 6 2025 రోజున ఆకుల సదానందం తండ్రి రామయ్య అను అతడు జమ్మికుంటలో పోగొట్టుకున్న తన వన్ ప్లస్ మొబైల్ కోడిపాక సురేష్ తండ్రి రమేష్ అను అతడు నాగంపేటలో తన రెడ్మీ 9 ప్రో మొబైల్స్ ను పోగొట్టుకొని పోలీస్ స్టేషన్ నీ సంప్రదించగా వారి యొక్క ఫోన్ల ఐ ఎం ఈ ఏ నెంబర్ ద్వారా సెయిర్ పోర్టల్ ద్వారా వారి యొక్క మొబైల్ ని పట్టుకొని బాధితులకి అందించడం జరిగింది కావున ఎవరైనా తన మొబైల్ ఫోన్స్ ని పోగొట్టుకున్నప్పుడు వెంటనే సెయిర్ పోర్టల్ లో అప్లోడ్ చేపించుకోవాలని జమ్మికుంట టౌన్ ఇన్స్పెక్టర్ ఎస్ రామకృష్ణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు

# కౌకూరులోని ఓమ్‌శ్రీ హైట్స్ అపార్ట్‌మెంట్స్‌లో రాన్వీర్ తైక్వాండో బెల్ట్ అవార్డుల ప్రదానం: ముఖ్య అతిథి (రిటైర్డ్) డీఎస్పీ ఈ. రమేష్ రెడ్డి





**కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి**
తైక్వాండో విద్యార్థుల అంకితభావం, కష్టాన్ని గుర్తించేందుకు సికింద్రాబాద్‌లోని కౌకూరులో ఉన్న ఓమ్‌శ్రీ హైట్స్ అపార్ట్‌మెంట్స్‌లో రాన్వీర్ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో "బెల్ట్ అవార్డింగ్ సెర్మనీ" వేడుకను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాధించిన ప్రగతిని ప్రశంసిస్తూ, ఈ కార్యక్రమం వారిలో మరింత స్ఫూర్తిని నింపింది. ఈ గౌరవనీయమైన వేడుకకు ఓమ్‌శ్రీ హైట్స్ సొసైటీ చైర్మన్, (రిటైర్డ్) డీఎస్పీ ఈ. రమేష్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో తైక్వాండో కీలక పాత్ర పోషిస్తుందని నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా, విద్యార్థులకు అద్భుతమైన మార్గనిర్దేశం చేస్తున్న గ్రాండ్ మాస్టర్ బి. రమేష్ కృషిని, ఆయన అకాడమీ అందిస్తున్న ఉన్నత స్థాయి శిక్షణను డీఎస్పీ ఈ. రమేష్ రెడ్డి ప్రత్యేకంగా ప్రశంసించారు. రాన్వీర్ తైక్వాండో అకాడమీ వ్యవస్థాపకుడు, మార్వెలస్ వరల్డ్ రికార్డు హెూల్డర్ మరియు అంతర్జాతీయ ఛాంపియన్ అయిన గ్రాండ్ మాస్టర్ బి. రమేష్, తమ విద్యార్థుల విజయాలను కొనియాడారు. తైక్వాండో కేవలం శారీరక శిక్షణ మాత్రమే కాదని, మానసిక దృఢత్వాన్ని, క్రమశిక్షణను కూడా నేర్పిస్తుందని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ వేడుకలో, తమ మొదటి మైలురాయిని చేరుకొని ఎల్లో బెల్టులు మరియు సర్టిఫికేట్లను అందుకున్న విద్యార్థులలో స్వరా డొమినిక్, అయాన్ మజుందార్, అహనా రోనంకి, జై ఆదిత్య తిరుమలశెట్టి, లక్ష్మివ్ తిరుమలశెట్టి, తనిష్కా బిరాదర్, అగస్త్య భమిడిపాటి, గోపు తన్వికా రెడ్డి, నైరా వైష్ణవి యాదవ్ మరియు మోక్షజ్ఞ రుతాల ఉన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది, భవిష్యత్తులో వారు తైక్వాండోలో మరిన్ని ఉన్నత విజయాలు సాధించడానికి ప్రోత్సాహాన్ని ఇచ్చింది.

# జయన్న ఫౌండేషన్ దాతృత్వం: నిరుపేద కుటుంబానికి జైపాల్ రెడ్డి అండ..

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్, జూన్ 25:**



హుజురాబాద్ మండలం, కనకలగిద్ద గ్రామానికి చెందిన నిరుపేద తాపీ మేస్త్రీ, సగర ఉప్పర కులస్తుడు కురిమిండ్ల నారాయణ ఇటీవల మరణించడంతో ఆ కుటుంబం దిక్కులేనిదైంది. ఈ విషయం తెలుసుకున్న జయన్న ఫౌండేషన్ ఛైర్మన్ జైపాల్ రెడ్డి తక్షణమే స్పందించారు. మానవతా దృక్పథంతో నారాయణ కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించుకున్న జైపాల్ రెడ్డి, వారికి 50 కిలోల బియ్యంతో పాటు ?5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కుల సంఘం పెద్దలు కొల్లూరి బుచ్చయ్య, కానిగంటి శ్రీనివాస్, కురుమిళ్ళ రాజు తదితరులు పాల్గొన్నారు. జయన్న ఫౌండేషన్ అందించిన ఈ సహాయం పట్ల గ్రామస్తులు మరియు మృతుడి కుటుంబ సభ్యులు ప్రగాఢ కృతజ్ఞతలు తెలిపారు. జైపాల్ రెడ్డి దాతృత్వాన్ని పలువురు ప్రశంసించారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం జూన్ 26 2025

# రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేసిన రైతు భరోసా లబ్ధిదారులు.

- కే ఎల్ ఆర్ చొరవతో రైతుల ఖాతాలోకి రైతు భరోసా నిధులు.
- హర్షం వ్యక్తం చేసిన రైతులు.
- రైతుల ఖాతాలోకి జమా అయిన యాసంగి పంట పెట్టిబడి సహాయం.



**మహేశ్వరం కరపత్రం ప్రతినిధి**
మహేశ్వరంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతు భరోసా కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్డు అర్బన్ ఏరియా పరిధిలోని 9 మండలలకు, రైతుల ఖాతాలో రైతు భరోసా నిధులు జమ కాలేదు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి,మండల పార్టీ నాయకుల చొరవతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిలతో మాట్లాడి 34 గ్రామాలలోని రైతులందరికి రైతుల ఖాతాలో రైతు భరోసా నిధులు జమ చేసారని అన్నారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం, వెంచర్లకు, రోడ్లకు, ఔటర్ రింగ్ రోడ్డుకు, కంపెనీలకు కూడా రైతు బంధు వేసిందని, వందల, వేల, ఎకరాలకు కూడా రైతు బంధు డబ్బులు జమ చేసి, ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం పాలు చేసారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయం చేసే రైతులకు మాత్రమే రైతు భరోసా ఇస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎప్పుడు కూడా అండగా ఉంటుందని, తమ పాలన ప్రజా పాలనా అని ఇప్పటి వరకు రాష్ట్రంలో ప్రజలందరికి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రుణమాఫీ, నిరుద్యోగులకు, ఉద్యోగాలు, 500కే గ్యాస్, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని, మాది పేదల ప్రభుత్వమని, ప్రజా పాలన అంటే మాది అని, ప్రజాపాలన చూసి ఓర్వలేకనే లేని పోనీ అపోహలు సృష్టించి ప్రజలను మోసం చేయడానికి చూస్తున్నారని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు రాక్షస పాలనా చేసిందని, అక్రమాలకు పాల్పడిందని, ప్రజలకు తీరని అన్యాయం చేసిందని, కాళేశ్వరం స్కాం, లిక్కర్ స్కాం,డబులు బెడ్రూమ్, దళిత బంధు పథకాలు అన్ని బిఆర్ఎస్ పార్టీ నాయకులే తీసుకున్నారని, ప్రజలకు ఏ ఒక్క పథకం కూడా సరిగ్గా అందలేదని, ధరణి పోర్టల్ వాళ్ళ కూడా రైతులు ఎంతో మంది ఆత్మహత్యలు చేసుకున్నారని,బిఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోగానే వారికి మతి బ్రమించి మాట్లాడుతున్నారని, మా ప్రభుత్వం గురించి గాని, మా పార్టీ నాయకుల గురించి గాని తప్పుగా మాట్లాడితే ఊరుకునేది లేదు అని కాంగ్రెస్ పార్టీ నాయకులు మండి పడ్డారు. రైతు భరోసా నిధులు ఖాతాలో జమ అయినందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వీట్స్ పంచుకోని తిన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ సిఎచ్ యాదయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ శివ గల్లా యాదయ్య, బిక్షపతి, జావీద్, కాకి ఈశ్వర్, ఎస్సి సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహా, మహేశ్వరం నియోజకవర్గం ఐ ఎన్ టీ యూ సి కార్మిక శాఖ అధ్యక్షులు నడికూడ శివ, శివగంగా రాజరాజేశ్వరి దేవస్థానం ఆలయ ఛైర్మన్ అల్లే కుమార్, ఆవుల యాదయ్య, చేపంగి ప్రవీణ్, మండల పట్టణ, గ్రామ శాఖ అధ్యక్షులు లాజర్, మహేశ్వరం నియోజకవర్గం సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్ర చంద్రమోహన్, ఎస్సి సెల్ మండల అధ్యక్షులు బాల్ రాజ్, బొల్లు కుమార్ యాదవ్, నేనవత్ రాజు నాయక్, వడ్డెమోని దాసు, మండల జనరల్ సెక్రటరీ పెంజర్ల యాదయ్య, ధనపురం రాజు,దయాకర్, పాండు నాయక్,అచ్చన్ నాయక్,సూర్య నాయక్, దేవేందర్ నాయక్, బిచ్య నాయక్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# మహిళ దారుణ హత్య.. ఒంటిపై బంగారం చోరీ

**గజ్వేల్ జున్ 25 కరపత్రం ప్రతినిధి**




మహిళ ఒంటిపై బంగారం కోసం దోపిడీ దొంగలు దారుణానికి ఒడిగట్టారు. మహిళను హత్య చేసి ఆమె ఒంటిపై ఉన్న బంగారం దోచుకెళ్లారు గుర్తు తెలియని దుండగులు. ఈ ఘటన సిద్ధిపేట జిల్లా గజ్వేల్ మండలం ధర్మారెడ్డి పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. సంఘటన స్థలాన్ని చేరుకున్న గజ్వేల్ ఎసిపి నర్సింలు,గజ్వేల్ సిఐ సైదా, అడిషనల్ సిఐ ముత్యం రాజు చేరుకొని పరిశోధన ప్రారంభించిరు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సహాయంతో ఆధారాలు సేకరిస్తున్నారు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.ధర్మారెడ్డి పల్లి గ్రామ శివారులో ఓ మహిళను గుర్తుతెలియని దుండగులు దారుణంగా హత్యచేశారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతురాలు నల్ల సత్తెమ్మ (65) గుర్తించారు.మృతురాలి వంటిపై ఉన్న బంగారం కోసమే దుండగులు ఆమెను చంపి ఉంటారని పోలీసుల అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడు, మరియు చెవి కమ్మలు సుమారు 4 తులాలు బంగారం ఎత్తుకెళ్లారని పోలీసులు వెల్లడించారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు

# నాడు హరిత హారం లో భాగంగా మొక్కలు నాటారు

- నేడు చెట్లను నరుకుతున్నారు - ప్రభుత్వ సొమ్ము వృధా వృధా





**గజ్వేల్ జున్ 25, కరపత్రం ప్రతినిధి**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో చెట్లను యదేచ్ఛగా కొట్టివేస్తున్నారు పర్యావరణ పరిరక్షణ కోసం నాటి ప్రభుత్వం హరిత హారం లో భాగంగా మొక్కలు నాటారు నేడు అవి వృక్షాలుగా మారాయి విద్యుత్ స్తంభాలకు ఆటంకంగా మారాయని విద్యుత్ సిబ్బంది వృక్షాలను కొట్టివేస్తున్నారు

# కుమార్తెలపై కోపంతో ఆలయానికి రూ. 4 కోట్ల ఆస్తుల విరాళం..!

- కోర్టు మెట్లు ఎక్కిన విజయన్ కుమార్తెలు.





**తమిళనాడుస్టేట్ జూన్ 25 కరపత్రం ప్రతినిధి**
తమిళనాడుతిరువణ్ణామలై జిల్లా అరణి సమీపంలోని కోనైయూర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ విజయన్ భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి పడవేడు సమీపంలోని కలికాపురంలో నివాసం కొన్ని నెలల క్రితం తండ్రి విజయన్‌కి, కుమార్తెలకు మధ్య ఆస్తి పంపకాల విషయంలో వివాదం దీంతో రూ.4 కోట్ల విలువ చేసే రెండు ఇళ్లు, పొలాలకు సంబంధించిన ఆస్తి పత్రాలను పాతవేడు గ్రామంలోని ప్రసిద్ధ శ్రీరేణుకాంబాల్ అమ్మవారి ఆలయ హుండీలో వేసిన విజయన్ కష్టపడి సంపాదించిన ఆస్తుల విషయంలో తన కుమార్తెలు తనను బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆవేదన విషయం తెలుసుకుని తమ తండ్రి హుండీలో వేసిన ఆస్తి పత్రాలను ఇచ్చేయాలంటూ ఆలయ అధికారులను సంప్రదించిన విజయన్ కుమార్తెలు విరాళంగా వచ్చిన ఆస్తులను తిరిగి ఇవ్వడం కుదరదని, నిబంధనల ప్రకారం జాయింట్ కమిషనర్ కార్యాలయంలో పత్రాలను అప్పగిస్తామని స్పష్టం చేసిన ఆలయ అధికారులు దీనిపై న్యాయస్థానం ఏం తేల్చనుందోనని ప్రస్తుతం తమిళనాడులో హాట్‌టాపిక్‌గా మారిన ఘటన

# అభినందన్ను పట్టుకున్న పాక్ మేజర్ హతం




**న్యూ ఢిల్లీ జూన్ 25 కరపత్రం ప్రతినిధి**
ం 2019లో ఇండియన్ ఎయిర్ఫోర్స్ వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ను పట్టుకున్న పాక్ ఆర్మీ మేజర్ మోయిజ్ అబ్బాస్ షా(37) తాజా ఎన్ కౌంటర్లో హతమయ్యా డు. తెహ్రీక్-ఎ-తాలిబన్ పాకిస్థాన్(TTP)తో జరిగిన గన్ఫైర్లో మరణించాడు. అయితే పుల్వామా అటాక్ అనంతరం ఇండియన్ ఆర్మీ పాక్లోని బాలాకోట్లో ఎయిర్టెక్స్ చేపట్టగా అభినందన్ పట్టుబడ్డారు. ఆ తర్వాత భారత్ తిరిగొచ్చిన ఆయన నేషనల్ హీరో గా గుర్తింపు పొందారు.

# తన ప్రేమకు అడ్డు వస్తుందని ప్రియుడితో కలిసి తల్లిని హతమార్చింది ఓ కూతురు ...

**కుత్బుల్లాపూర్, జూన్ 25 కరపత్రం ప్రతినిధి**
పదవ తరగతి లోనే ప్రేమలో పడింది ఓ అమ్మాయి. తన ప్రేమకు తల్లి అడ్డు వస్తుందని ప్రియుడుతో కలిసి కన్న తల్లిని హతమార్చింది. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని సర్దార్ పటేల్ నగర్ లో మంగళవారం చోటుచేసుకుంది. ఈ కేసును జీడిమెట్ల పోలీసులు 24 గంటల్లోనే చేదించారు. ఈ మేరకు బుధవారం బాలానగర్ డిసిపి సురేష్ కుమార్ డిసిపి కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని సర్దార్ పటేల్ నగర్ లో నివాసముండే అంజలి (39) తేజశ్రీ (16) ఇద్దరు తల్లి కూతుర్లు. తేజశ్రీ పదవ తరగతి చదువుతుంది. ఈ అమ్మాయికి నల్లగొండ కట్టంగూర్ ప్రాంతానికి చెందిన శివ(19) డీజే ఆపరేటర్ తో గత ఎనిమిది నెలల గతం ఇంస్టాగ్రామ్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం వారిద్దరి మధ్య గాఢమైన ప్రేమగా మారింది. కొన్ని సందర్భాలలో తేజశ్రీ కోసం శివ హైదరాబాదులోని వాళ్ల ఇంటికి వచ్చాడు. అప్పుడు ఈ విషయం తల్లి అంజలికి తెలిసింది. అప్పుడు అంజలి కూతురు తేజశ్రీని చిన్నవయసులో ప్రేమ ఏంటమ్మా, ఇరుగుపొరుగు వాళ్ళు చూస్తే ఏమనుకుంటారు అని నచ్చ చెప్పింది. పెళ్లి వయసు వచ్చిన తర్వాత నేనే పెళ్లి చేస్తాను అని తేజశ్రీ కి చెప్పింది. ఇప్పుడు ఇవి మానుకోమని కూతురుతో అన్నది. తల్లి మాటలు పట్టించుకోని తేజశ్రీ శివతోనే ప్రేమ వ్యవహారం నడుపుతూ వచ్చింది. గత వారం క్రితం తేజశ్రీ తన సోదరి తో కలిసి ప్రియుడు ఉంటున్న కట్టంగూర్ వెళ్ళింది. దీంతో తల్లి అంజలి జీడిమెట్ల పోలీస్ స్టేషన్లో మిస్సింగ్, కిడ్నాప్ కేస్




పెట్టింది. ఈ మేరకు జీడిమెట్ల పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా అమ్మాయిని పట్టుకొని తల్లికి అప్పగించారు. కొన్నిసార్లు శివతో ప్రేమ వ్యవహారం వద్దు అంటూ తల్లి అంజలి తేజశ్రీని కొట్టింది. దీంతో తన ప్రేమకు తల్లి అంజలీనే కారణం అంటూ తల్లి పై కక్ష పెంచుకుంది. ఈ క్రమంలో ప్రియుడు శివ, అతని సోదరుడు యశ్వంత్ (16) తో కలిసి తల్లి అంజనేని చంపేందుకు స్కెచ్ వేసింది. ఇంట్లో తను మాత్రమే ఉన్న సమయంలో తన తల్లిని చంపడానికి ప్రియుడు శివ, అతని తమ్ముడు యశ్వంత్ ని ఇంటికి పిలిపించింది. తల్లి అంజలి ఇంట్లో పూజ చేసుకుంటుండగా చున్నీతో గొంతు నలిమి, సుత్తితో కొట్టారు. దీంతో అంజలి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. దీంతో మృతి చెందిందని భావించిన ప్రియుడి శివ, అతని సోదరుడు వెళ్లిపోయారు. వెంటనే అంజలి కాళ్లు చేతులు కదిలించడం గమనించిన కూతురు తేజశ్రీ మళ్లీ ఫోన్ చేసి శివ, అతని సోదరుడిని పిలిచింది. వెనక్కు వచ్చిన శివ అతని సోదరుడు, కూతురు అంజలి ముగ్గురు కలిసి ఇద్దరు గొంతుకు చున్నీని గట్టిగా బిగించగా ఒకరు తలపై సుత్తితో గట్టిగా కొట్టారు. దీంతో అంజలి అక్కడకక్కడే రక్తపు మడుగులో పడి మృతి చెందింది. అప్పుడే అక్కడకు వచ్చిన అంజలి చిన్న కూతురు రక్తపు మడుగులో ఉన్న తల్లిని చూసి అక్కను అడిగింది. తన తల్లికి ఏమైందని ప్రశ్నించింది. దీంతో తేజశ్రీ అమ్మ కుర్చీ నుండి పడిపోయి తలకు గాయం అయిందని తన స్నేహితుల ఇంటికి వెళ్లి పెద్దవాళ్ళను తీసుకురమ్మని సోదరికి చెప్పింది. అమ్మను హాస్పిటల్కు తీసుకెళ్దామని అక్కతో చెల్లి చెప్పింది. అక్క పట్టించుకోకపోవడంతో 100 నెంబర్ కు డయల్ చేసి జీడిమెట్ల సమాచారం ఇచ్చింది. ఈ మేరకు వెంటనే అక్కడకు చేరుకున్న జీడిమెట్ల పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు 24 గంటలు గడవకముందే నిందితులను పట్టుకున్నారు. వారిని విచారించగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రేమ వ్యవహారంతో పాటు తల్లి పై ద్వేషం ఉందని, తన తల్లి తనను ఎప్పుడూ ప్రేమగా చూడలేదని, తన తల్లి తనను ఎప్పుడూ కొడుతూ, తిడుతూ ఉండేదని విచారణలో తేజశ్రీ వెల్లడించింది అన్నారు. కూతురి ప్రోత్బలంతోనే ఈ హత్య జరిగిందని డీసీపీ సురేష్ కుమార్ వెల్లడించారు. తేజశ్రీ (16), యశ్వంత్ (16) లను జోనల్ హెూమ్ కు, శివ (19) ను చర్లపల్లి జైలుకు తరలిస్తున్నట్లు డిసిపి సురేష్ కుమార్ తెలిపారు. ఈ కేసులో 24 గంటల్లోనే చేదించిన బాలనగర్ ఏసిపి, జీడిమెట్ల సిఐ గడ్డం మల్లేష్, బృందాన్ని డిసిపి సురేష్ కుమార్ అభినందించారు...

# జంట నగరాల బోనాల నిర్వహణకు 20 కోట్ల నిధులు జారీ

- తెలంగాణ బోనాలు, సాహితీ ప్రస్తావన కు ఎంతో ప్రాముఖ్యత ఉంది..
- రూ. 20 కోట్లు మంజూరు చేసిన సిఎం కి ప్రత్యేక ధన్యవాదాలు..
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జూన్ 25 కరపత్రం ప్రతినిధి**
తెలంగాణలో అత్యంత అంగరంగ వైభవంగా హైదరాబాద్ జిల్లా జిహెచ్ఎంసి పరిధిలో గల దేవాలయాల్లో నిర్వహించే బోనాల ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 20 కోట్ల రూపాయలను 2783 దేవాలయాలకు వివిధ కార్యక్రమాలు నిర్వహణకై చెక్కుల రూపంలో నిధులు జారీ చేయడం జరిగిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.



బోనాల ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 కోట్లు అందించిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆషాడమాసంలో ముందుగా నగరంలో గోల్గొండ బోనాలు జూన్ 20న, జూలై 1,2 తేదీలలో బల్కంపేట ఎల్లమ్మ బోనాలు, జూలై 13,14 తేదీలలో శ్రీ ఉజ్జయిని మహాకాళి దేవస్థానం నందు, జూలై 20న లాల్ దర్వాజా బోనాలు అలాగే జూలై 23న చార్మినార్ భాగ్యలక్ష్మి బోనాలు అలాగే మిగిలిన దేవాలయాల కూడా బోనాల ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ సంప్రదాయానికి, నిర్దిష్ట విధి విధానాల చట్రానికి అతీతంగా ఉండే మాతృదేవతారాధన, గ్రామీణ దేవతారాధన లోంచి పుట్టిన బోనాలు క్రమక్రమంగా సాంప్రదాయంగా ఏర్పడటం ఒక విశేషం అని ఈ పరిణామ క్రమంలో హైదరాబాద్ జంట నగరాల్లో శతాబ్ద కాలం నుంచి జరుగుతున్న ఈ బోనాల పండుగ మరెన్నో సామాజిక, నిర్మాణాత్మక పరిణామాలను కూడా చెప్పకనే చెబుతుందని అన్నారు. మొదట్లో పల్లెలకు, గ్రామాలకు సంబంధించిన ఉత్సవ విశేషంగా బోనాల పండుగ ఉండేదని ఇప్పుడు హైదరాబాద్ నగరంకి విస్తరించి మహానగరంగా ఎదిగిన తర్వాత కూడా అనాదికాలపు గ్రామీణ జీవన సంస్కృతికి ఇంత ఆదరణ, ఆచరణ ఉండటం భా

# చేతి వృత్తి వస్తువుల ప్రదర్శన అమ్మకాలను ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి, మంత్రులు..

**హైదరాబాద్ జూన్ 25 కరపత్రం ప్రతినిధి**
ప్రతి సంవత్సరం బోనాలకు ముందు ఏర్పాటు చేసే చేతివృత్తుల మేళాలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సహకారంతో నేడు తెలంగాణ రాష్ట్ర సచివాలయం ప్రక్కన 30



స్టాళ్లతో ఏర్పాటు చేసిన బిసి చేతి కులవృత్తుల వస్తువుల ప్రదర్శన, అమ్మకాలను తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు గౌరవ శ్రీ మల్లు భట్టి విక్రమార్క, ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పశు సంవర్ధక పాడి పరిశ్రమ అభివృద్ధి మత్స్య క్రీడలు యువజన శాఖ మంత్రి డా"వాకిటి శ్రీహరి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ,షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యేలు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.